# రాగమయి

(కథానిక)

"అబ్బాయి ఉత్తరం వ్రాశాడే"

"ఆఁ? ఏమన్నారూ! అబ్బాయి ఉత్తరం వ్రాశాడా? డబ్బు పంపమని వ్రాసివుంటాడు. అంతేగదండీ?" అంటూ సావిత్రమ్మ చావడిలోకి వచ్చింది.

"అంతే వ్రాశాడు వెధవ. మొన్న ఒకటవ తేది తొంభైరూపాయలు పంపాను. ఈ దినం తారీఖు పదహారా? ఇంతలోనే ఈ జాబు ముప్ఫైరూపాయలు పంపమని. ఇదుగో చదువు నీకే తెలుస్తుంది నీ కొడుకు ఘనత." జాబు ఆమెపైకి గిరవాటేసి వాలు కుర్చీలో వాలాడు సత్యనారాయణయ్య.

"నూటఇరవై రూపాయలే! అబ్బాయిగారికి కాలేజీలో అడుగుపెట్టగానే కళ్ళు నెత్తి నెక్కి కూర్చున్నాయి గామోసు."

"జమీందార్లమనుకుంటున్నాడేమోనే."

"అనుకోడు మరి, ఎంత అడిగితే అంత పంపుతుంటే. మనం తింటున్నామో లేదో వాడి కెందుకు, వాడికి పొందుపెల్లితే చాలు."

"వీడికి చదువూ వద్దు పాడూవద్దు. ఇప్పుడే వ్రాసేస్తాను యింటికి తమ్మని. కొడిపట్టుకొని దున్నుకొంటాడు వెధవ. వాడికి బాగుపడే యోగముంటేగా ఇంతకూ."

"నేను చెప్తే వింటారా? మనకీ చదువు చాలు. నిక్షేపంలాంటి కరణీకముంది. ఏదో మనదగ్గరే పడివుంటాడు. మన కేమయినా ఇద్దరు ముగ్గురు మగపిల్లలున్నారా? అంతా వాడే. అని నెత్తిన నోరు పెట్టుకొని చెప్పితే అబ్బో! మీరు విన్నారా? డాక్టరు చదువట డాక్టరు చదువు. ఇంతడబ్బు తగలేసి రేపు వాడు పుండ్లు కడిగి కౌన్సులు చేయాల్సిందే గదా. ఈ చదువుకు ఇప్పటికే రెండువేలు పోశాము. ఆ రెండువేలు వుంటే అమ్మాయికి వడ్డాణం వచ్చునుగదా. ఇంతకూ మనకర్మ" అంటూ ఉపన్యాసం దంచేసింది సావిత్రమ్మ

ఈ విసురుతో సత్యనారాయణయ్య కోపం బుస్సుమంది.

"ఒక్క కానీ పంపిస్తానేమో చూడు. ఎలా ఏడుస్తాడో ఏడవమను" అంటూ ఆ జాబు చించి గాలి కెగరేసి చుట్ట ముట్టించాడు.

"అమ్మా, పసులుగాడికి వడ్లు కావాలటనే" అంటూ వంటింట్లోనుండి కేక వినిపించేసరికి సావిత్రమ్మ రుసరుసలాడుతూ లోపలికి వెళ్ళిపోయింది.

ఈ రాద్ధాంతమంతా పార్వతి తలుపుచాటున నిల్చొని వింటూనే వుంది. ఏమయినా నోరు కదిపిందంటే ఆ బ్రహ్మాస్త్రాలు, ఆగ్నేయాస్త్రాలు తనమీదికే విజృంభిస్తాయి. అందుకే నోరు మెదపకుండ నిలుచుని వుంది. తమ్ముడిని ఆ విధంగా దుయ్యబట్టుతూంటే ఒళ్లంతా చీమలు పాకుతున్నట్లుంది. "మరీ నాన్నది అమ్మది అఘాయిత్యం. వాడేమి వృథా ఖర్చు చేయడు. డబ్బు అవసరమయితేనే వ్రాస్తాడు" అంటూ తనలో తానే తమ్ముడిని సమర్థించడానికి తంటాలు పడుతూంది.

మధ్యాహ్నం భోజనాలయాయి. ఉదయం లేగిన తుపాను భోజనాలతో సద్దుమణిగింది. సత్యనారాయణయ్య చావడిలో గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. ఇంటిలో ఆడంగుల "పురాణ కాలక్షేపం" జరుగుతూంది. సావిత్రమ్మ వింటూనే మధ్యమధ్య కునికిపాట్లు పడుతూవుంది. పార్వతికి "దివ్యతరుణము, ఆలసించిన ఆశాభంగము" అన్న సినిమా అడ్వర్టయిస్‌మెంటు జ్ఞాపకంవచ్చింది. మెల్లగా చదువుతూన్న పుస్తకం క్రింద బెట్టింది. చదవడము మానేసేసరికి సావిత్రమ్మ ఉలిక్కిపడి లేచింది. "ఏంతాడూ కథ పూర్తయిందా? కృష్ణుడు ద్వారకలో అంతఃపుర కాంతలను చూడబోయాడు. తరువాత?" అంటూ ఆవులించింది.

"ఇంకా ఏ అంతఃపుర కాంతలను చూడడ

"వరశ్రీ"

మమ్మా. కృష్ణ నిర్యాణం గూడ అయిపోయింది."

"నా నిద్ర కాలిపోను! నేను మరీ మరీ అధ్వాన్నమయిపోతున్నాను."

"సరేగానమ్మా. ఉదయం గోపి జాబు వ్రాశాడా? డబ్బు పంపమని వ్రాసినట్లుందే? బాగున్నాడటనా?"

"ఆఁ వ్రాశాడమ్మా. ఇంకా ముప్పై రూపాయలు పంపమని వ్రాశాడు. నీకు తెలియనిదేముంది. నీవే చెప్పమ్మ యెక్కడనుండి తేగలమో. వాడు మాత్రం చిన్నా చితకా. ఆ మాత్రం తెలిసికోవద్దూ?"

"వాడి కెంత అవసరమో."

"ఏమి అవసరమో ఏమో. నేను కోపంలో బాగా చీవాట్లు పెడుతూ జాబు వ్రాశాను. పోస్టు కూడా చేశాను. కాని అలా వ్రాసినప్పటినుండి ఒకటే దిగులుగా వుంది."

"నీకు బలే తొందరమ్మా."

"అదే నేనూ అనుకోవడం. ఆ ఉత్తరం చూచి వాడేమనుకొంటున్నాడో యేమో. మీ నాన్న గూడ వ్రాశారు. ఏమోనమ్మ. ఇప్పటి పిల్లలని నమ్మడానికి వీలులేకుండా వుంది. సుబ్బయ్య కొడుకు ఏమి చేశాడో తెలుసా? ఎవరికో అప్పు ఐదు రూపాయలు కావాలన్నాడట. ఆమె పాపం! అక్కడా ఇక్కడా పని చేసుకొని పొట్ట గడుపుకొంటూంది. వాడికి నిలుచున్న పళంగా ఐదు రూపా లెలా ఇస్తుంది? నోటి కొచ్చినట్లల్లా తిట్టిందట. వాడికేం బుద్ధి పుట్టిందో మధ్యాహ్నం రైలు క్రిందబడి చచ్చిపోయాడు. అంతా విపరీతపు కాలము. మా రోజులలో మే మెరగమమ్మా ఈ రైళ్ళ క్రింద పడడమూ, చావడమూ. ఇంతకూ ఈ గోపిగాడిదే దిగు అయింది నాకు."

పార్వతి పాచిక పారింది. విజయగర్వంతో ముందుకు సాగించింది సంభాషణ "నీకీ మధ్య కోపం యెక్కువయిపోయింది. వాడేం చేశాడని అంత కోపమమ్మా. ఇప్పటి కాలపు వాళ్ళను చూస్తే నీకే తెలుస్తుంది మన గోపి యెంత మంచివాడో మన గోపి నాన్న కెప్పుడయినా యెదురు చెప్పాడా? మేమంటే వాడికి ప్రేమ లేకేం? వాడి స్వభావమే అంతే గనుక మాతో యెక్కువగా మాట్లాడడు. అంతేగాని మేమంటే గిట్టకనా? దానికేమో నీవు "చదువుకొంటున్నానని గర్వమురా నీకు" అంటూ సాధిస్తావమ్మా"

"అవును పాపం. నాకలా మూగమొద్దులా వుంటే బలే కోపం. ఎప్పుడో మూడు నెలల కోసారి ఇంటి కొస్తాడు గదా. ఆ నాలుగు రోజులయిన హాయిగా నవ్వుతూ పేలుతూ వుండగూడదూ? నీ వన్నట్లు యెన్ని తిట్టినా యెదురు చెప్పడు; మంచివాడే. అయితే ఇదేమిటమ్మా ఈ డబ్బు గుంజడము?"

"నాదగ్గిర ఏడ్లపైకము నలభై రూపాయలున్నాయి గదమ్మా. వాడికి ముప్పై రూపాయలు పంపితే సరిపోతుంది."

"సరే. ఇంతకూ నీ డబ్బు తింటున్నాము."

"ఆఁ ఏముందమ్మా. నేను మాత్రం పరాయిదానినా" అంటూ పార్వతి లేచిపోయింది.

పార్వతి మనసిప్పటికి తేలికపడింది. "అబ్బ గోపికి త్వరగా ఉత్తరం వ్రాయాలి. రేపటికే వాడికి అమ్మా నాన్న జాబు అందుతాయి. ఈ ఉత్తరమయినా చూచి కొంచెం కుదుటపడుతాడు." అనుకొని త్వరత్వరగా జాబు వ్రాసింది.

"చిరంజీవి గోపికి,

తమ్ముడూ! ఇప్పటికీ నీకు అమ్మ నాన్న వ్రాసిన జాబులు చేరాయనుకొంటాను. చాల కష్టపడ్డావుకదూ? ఉత్త పిచ్చివాడివి. అమ్మ కోపం నీకు తెలీనూ? ఒక్క నిముషమే ఆకోపం. అలా జాబు వ్రాశానని ఒకటే దిగులు పడుతూంది. త్వరగా అమ్మకు జాబువ్రాయి గోపి. నీవిలా ఖర్చుపెట్టడం నాకే కష్టంగావుంది. ఇక నాన్న కామాత్రం కోపంరాదూ?

అక్కయ్య."

ఉత్తరం ముగించి పోస్టు చేయించింది.

* * *

"అమ్మా! అమ్మా! అన్నయ్యొస్తున్నాడే," అంటూ లలిత వంటింట్లోకి పరుగుతీసింది. అమ్మకు కబురందించి మళ్ళీ సావిట్లోకి అన్న కెదురొచ్చింది.

'ఏం, లలితా' అంటూ నవ్వుతూ పలుకరించాడు గోపి. లలిత పండ్లికిలించింది. పట్టలేని

ఆనందంతో కండ్లు మెరిశాయి. అంతే. ఇంతలో సావిత్రమ్మ, పార్వతి వచ్చారు. "ఏంరా. సెలవులిచ్చికూడ వారంరోజులయాయే. సరే ఇంట్లోకిరా. పాపా! కాఫీకి నీళ్ళు పెట్టమ్మా" అంటూ కొడుకును పరామర్శిస్తోంది తల్లి. "మరీ చిక్కిపోయేవే ఆ ముఖం మాడి నల్లబడింది అన్నం సరిగా తినడంలేదా ఏం? ఎంతడబ్బు తగలేసినా ఇంట్లో ఉన్నట్లుంటుందా మరి"

"నేను చిక్కిపోయానా? లేదమ్మా బాగా బలిశానుకూడా. నాన్న పొలంమీదకు పోయారా?"

లలిత అమ్మపక్కనే కూర్చుంది. అన్నను చూస్తుంటే గారెలు, బూరెలు తింటున్నట్లుంది. అన్నయ్య పెరట్లో కెప్పుడుపోతాడా పెట్టె తెరచి రిబ్బన్లు కుచ్చులూ ఎప్పుడు తీసుకొందామా అని ఉవ్విళ్ళూరుతూంది లలిత.

సత్యనారాయణయ్య వచ్చాడు చిట్టినెత్తుకొని. నాన్నగారిని చూస్తూనే లేచాడు గోపి. ముఖాన మేఘాలు ఆవరించినై. 'ఏంరా ఎప్పుడొచ్చావ్'? అన్నాడు. "ఇప్పుడేవచ్చా"నంటూ మెల్లగా పణిగాడు గోపి. "మామయ్యొచ్చా"డంటూ చిట్టి గోపిమీదికి దూకింది "చిట్టికి బిస్కట్లయినా తీసుకరాలేదూ?" అని అడిగింది సావిత్రమ్మ. "లేదమ్మా. ఎవ్వరికీ ఏమీ తీసుక రాలేదు టైమ్ లేక." అంటూ కుంటిసాకు చెప్పి తప్పించుకొన్నాడు. పాపం లలితకు గుండె ఒక్క గెంతుతో నోట్లోకొచ్చి కూర్చున్నట్లుంది. అయినా మెల్లిగా మింగేసింది.

గోపి వంటింట్లోకి పోయాడు పార్వతిని వెదుక్కుంటూ. పార్వతి కాఫీ చల్లారుస్తూంది. అక్కయ్యకు దగ్గరగా వెళ్ళి మెల్లిగా అడిగాడు.

"ఇంతకూ తుపాను మళ్ళీ రేగుతుందా?"

"చాల్లేరా. నీవు చేసినదిమాత్రం మంచిపని గదూ? అమ్మా నాన్న ఆమాత్రం కోప పడరూ? మళ్ళీ రేగుతుందని భయములేదులే" అంది పార్వతి.

గోపివచ్చి పదిరోజులయింది. ప్రమాణపు సన్నాహంలో వున్నారు. అందరూ భోంచేసి తాంబూలం వేసుకుంటూ కూర్చున్నారు హాలులో. లలిత అన్నయ్యకు వినిపించకుండ సావిత్రమ్మనడిగింది మెల్లిగా "అమ్మా అన్నయ్యకు పెళ్ళెప్పుడే?" సావిత్రమ్మకు బలే నవ్వొచ్చింది. పెద్దగానే అనేసింది "నీకు పెళ్ళయితేగదూ అన్నయ్యకు పెళ్ళి. అయినా ఏమో అన్నయ్యనే అడుగు" లలితకు చురచుర చెమటలు పోశాయి. క్రిందటి సంవత్సరము ఏదో తగవులాడుకొని కోపంతో లలిత "అయ్యకు పెళ్ళితే. వదినెవరో నాకు తెలుసులే" అని అనే సరికి "చప్" మని చెంపపెట్టుపెట్టాడు గోపి. పాపం ఈ రోజు చెంప ముందుగా ఇన్షూర్ చేసుకుండా అడిగేసింది పిచ్చిపిల్ల. అయితే అలాంటిదేమీ జరుగలేదు. గోపి నవ్వాడు. బ్రతికేనురా బాబూ! అనుకుంది లలిత. మెల్లిగా తేరుకొనేసరికి అన్నయ్య చిన్న బాంబు షెల్ లాంటిది విసిరాడు "నీ పెళ్ళి త్వరగా కానియ్యి. నా పెళ్ళి చూతువుగాని" అని. లలితకు ముఖమంతా ఎఱ్ఱబడింది. చిట్టి ఏడుస్తూందని సాకు పెట్టి తుర్రుమంది. లలిత మళ్ళీ తిరిగి వచ్చేసరికి గోపి లేడు. అమ్మ, అక్కయ్య అన్నయ్య పెండ్లిమాటలే మాట్లాడుతున్నారు. మెల్లిగా వెళ్ళి కూర్చుంది. సావిత్రమ్మ అంటూ వుంది: "ఏ తల్లి వస్తుందో ఇంత డబ్బు ఖర్చు పెట్టి చదివిస్తున్నాము. రేపు మమ్మల్ని చూసి ఉద్ధరిస్తాడా? ఏమి బిడ్డలో."

"వాడివిషయం నీకు తెలియదమ్మా వాడు అందరిలాంటివాడు కాదు. ఇంతకూ మనం చదివించాలి కదా. రేపు వాడి బాధ్యత నెరవేర్చలేకపోతే పోనీ. మనం మన బాధ్యత నిర్వహిస్తే చాలు." అంది వేదాంతి పార్వతి. "అమ్మ చెప్పేది నిజమేనా? అయితే అన్నయ్య మమ్మల్ని కార్లోకూర్చో నివ్వడూ? వదిన, అన్నయ్య ఇద్దరే కార్లో షికారు పోతారా?" అబ్బ! లలితకు ఒళ్ళంతా చీమలు పాకుతున్నట్లుంది. చటుక్కున లలితబుర్రలో ఒక ఆలోచన మెరుపులా మెరిసింది. కళ్ళు మెరిశాయి. ఇంత చక్కని ఆలోచన తన చిన్నబుర్రలో దాచడం ప్రమాదమే. అమ్మకు చెప్పితే? ఇంకెందుకూ చెప్పేసింది, "చిట్టిని అన్నయ్యకు చేసుకొంటే." అమ్మ, అక్కయ్య, ఒక్కసారిగా నవ్వారు. లలిత త్రుళ్ళిపడింది. "పిల్లకే

మయినా పిచ్చా? నవ్వుతారేం?" ఏమీ బోధపడలేదు లలితకు."

"అబ్బో పెద్ద ఆలోచనలే లలితకు" అంటున్నారు నవ్వుతూనే. చిట్టి గూడ కిలకిలమంటూంది.

పార్వతి నవ్వాపుకుంది. "ఏమే లలితా, నీకు చిట్టి వదినె కావాలని వుందా?" అంది.

"మీరేకదూ అన్నారు. ఎవరయినా వస్తే అన్నయ్య మనల్ని కార్లో కూర్చోనివ్వడని. చిట్టయితే అలా చేయదుగా" అంది కోపంగా లలిత.

"కోరుకోవడం, వదినె రావడం, చాల దూరం పోయిందే ఆలోచన? ఎవరినిస్తే ఏమమ్మా. మన అన్నయ్య అలా చేస్తాడా? మనం మాత్రము మంచి వదినెను తీసుకరామూ? ఎవరి దగ్గరా ఇలా అనకు" అని సన్నగా మందలించింది పార్వతి.

ఇంతలో గోపి తిరిగివచ్చాడు. రాత్రికే ప్రయాణం. ఇప్పటివరకు డబ్బు విషయమే ఎత్తలేదు. "ఇప్పుడడిగితే? నాన్నగూడ లేరు. అమ్మను అడలగొట్టవచ్చు, లేకపోతే ఎలా?" యుద్ధానికి తయారయాడు గోపి.

"అమ్మా, ఈ నెలకు నూరురూపాయలు కట్టాలి. రాత్రిబండికి వెళ్తా." అన్నాడు.

ఈ మాటతోనే మండి పడింది సావిత్రమ్మ. మునుపటి కోపం తల ఎత్తింది. "నూరా! ఎక్కడనుండి వస్తాయ్? మీ నాన్ననే అడుగు" అంది.

"నాన్నతో నీవే చెప్పమ్మా. రాత్రికి పోవాలి" అన్నాడు లేని నవ్వును తెచ్చుకుంటూ.

"నాన్నగారంటె ఎంతభయం పాపం. నేను ఒకటే మాట చెబుతున్నా నబ్బాయి. ఇక్కడేమీ రూపాయిలు రాసులు పోసుకొని కూర్చోలేదు మేము. నెలకు ఎనభై రూపాయిలు పంపుతాము. నీ ఇష్టమేమిటో అలా చేసుకో. అంతకు పైన ఒక దమ్మిడీకూడ ఎక్కువ పంపము. తెలిసిందా? నీ అభిప్రాయమేమిటో నాకేమీ అర్థంకావడంలేదు. మేము నానా అగచాట్లూపడి నీవు అడిగిందే తడవుగ నూర్లు, నూటఏభైలు పంపుతుంటే నీ అభిప్రాయం ఇలాగే వుంటుంది మరి. ఎలా తెస్తున్నామెం ఎప్పుడయినా ఆలోచించావా?"

"ఇంతకూ నన్నేం చేయమన్నారు? హాస్టలుకే నెలకు తొంభైరూపాయలు కట్టాలి. చాకలికి మంగలికి ఏమయినట్టు? నమ్మకము లేకపోతే ఎవరినయినా అడగండి"

"నిన్ను నమ్మవచ్చునంటావా? నీ దొంగలెక్కలు నాకు తెలియవంటావా? ఎనభై రూపాయలు పారేస్తాము నెలనెలకు. నీ ఇష్టమెట్లో అలాగే చేసుకో."

"ఆ ఎనభై ఏమిటో ఇలా పారెయ్యండమ్మ. రాత్రిబండి కెళ్లుతాను. కొడుకునే నమ్మలేరు. ఇక పరాయి వాళ్లను..."

"నమ్మకాలట నమ్మకాలు. డబ్బుకావలిస్తేనేగా నీవు జాబు ముక్కయినా వ్రాసేది? నీ విప్పుడే ఇలా ఉన్నావే. రేపు మమ్మల్నేమి ఉద్ధరిస్తావు నాయనా? పోపొమ్మంటావు."

"జరుగబోయేవి గూడ చెప్తున్నావు గదమ్మా—" మధ్యలోనె "స్నానానికి లె"మ్మంటూ పార్వతి తమ్ముడిని ఆపింది.

ఆ రాత్రే గోపి వెళ్ళిపోయాడు. బండెక్కుతూ కూడ ముఖం చిట్లించుకొనే ఉన్నాడు. పార్వతి మనసు గాయపడింది. సావిత్రమ్మకు "కనిన ప్రేమ" విరిగినట్లనిపించింది.

ఆరుసంవత్సరాలు దొర్లిపోయాయి. పోతూ పోతూ, సత్యనారాయణయ్య కుటుంబాన్ని "చురచుర" విషపు చూపుచూచి చక్కబోయింది. గత మూడు సంవత్సరాలు వరుసగా పంట లెండిపోయాయి. ఈ విసురుకు ఆ కుటుంబము కోలుకోలేక పోయింది. నెలనెలా కొడుకుకు వందలు పంపడంతో మరీ చితికిపోయింది. ఈ దిగులుతోనె సావిత్రమ్మ మంచమెక్కింది. నెలరోజులకే చనిపోయింది. భార్య చావుతో సత్యనారాయణయ్య పిచ్చివాడయాడు. భార్యకోసం చిన్నపిల్లవాడిలా ఏడ్చాడు.

గోపి ఆ సంవత్సరమే మద్రాసులో ప్రాక్టీసు పెట్టాడు. నెలకు నూరురూపాయలు గూడ రావడంలేదు. గోపి తనతో మద్రాసు వచ్చెయ్యమని ఎంత చెప్పినా వినలేదు తండ్రి.

"తాను పుట్టిపెరిగిన ఊళ్ళోనే ప్రాణాలు వదిలితే అదే చాలు"నని మొండివాదన చేశాడు. ఇప్పుడు కుటుంబ భారమంతా పార్వతి నెత్తిన పడింది. సత్యనారాయణయ్యకు స్వతహాగా ఆలోచించే శక్తి క్షీణించింది. కంటి చూపు తగ్గింది. పగలంతా చావిట్లో కూర్చునేవాడు. వాళ్ళూ, వీళ్ళూ వచ్చి చేరేవారు. వాళ్ళతో ఎప్పుడూ భార్యను గురించే మాట్లాడేవాడు. మధ్య మధ్య కళ్ళనీళ్లు పెట్టుకుంటూ, "ఇంత బ్రతుకు బ్రతికి ఆఖరి ఘడియల్లో డబ్బు కిబ్బంది పడుతూ చనిపోయింద"ని బావురు మనేవాడు. పార్వతి విశ్రాంతి అంటే ఏమిటో చూడలేకపోయేది. తండ్రిని వేయికళ్ళతో చిన్నపిల్లవాడిని కాపాడినట్లు కాపాడుతూంది.

* * *

గోపికి ప్రాక్టీసు బాగా జరుగుతూంది. భార్య, నలుగురు పిల్లలతో దర్జాగా ఉంటున్నాడు. ఇక్కడ చిట్టి పెద్దదయిపోయింది. పార్వతి కిప్పుడు చిట్టిపెళ్ళే స్మరణ అయింది. ఎక్కడ వెదికినా మంచిసంబంధము దొరకలేదు. ఇప్పటికే నాలుగయిదు ఉత్తరాలు వ్రాసింది గోపికి చిట్టికేదయిన మంచి సంబంధం చూడమని. గోపికి చీమకుట్టినట్టయినా లేదు. ఒకటి వెంబడి ఒకటి ఉత్తరాలు వ్రాసేసరికి విసుక్కున్నాడు. ఈ దినమింకొక ఉత్తరం వ్రాసింది. మొదలే పనితో చిరాకుగా ఉన్నాడు. అక్కనిష్ఠురంగా జాబు వ్రాసేసరికి మండిపడ్డాడు. భార్యదగ్గరే విసుక్కున్నాడు! "ఒకటే ఉత్తరాలు. నన్నేం చేయమని? ఎవరయిన ఉంటే ఊరుకుంటామా? చిట్టికిప్పుడేమంతతొందర? నేనసలే ఈ పనితో చచ్చిపోతున్నాను. పైగా ఈ ఒత్తిళ్ళు ఈ జాబులు. అబ్బబ్బ!" కాలుగాలిన పిల్లిలా పచారు చేస్తున్నాడు గదిలో. ఆడబిడ్డమీద పూర్వపుకక్ష తీర్చుకోడానికి గోపి భార్యకు అదను దొరికింది. ఇక సాగించింది, "మీ అక్కగారు అంత పెద్దదిగదా. కొంచెమయినా లోకజ్ఞాన ముండద్దూ? అబ్బే, వాళ్ళకేం మన మెట్లా చస్తే. వాళ్ళ పనులు చక్కబెట్టితే చాలు. అన్నీ జరుపుతూవుంటె-యెంత పైకం అడిగితే అంత పైకం, పిల్లకు చీరలు, ఆమెకు చీరలు అన్నీ ఇచ్చి సత్కరిస్తుంటే "మా తమ్ముడు" అంటూ వచ్చి నెల రోజులు మకాం వేస్తారు. ఇప్పుడు చూశారు గదూ? ఆమె ఉత్తరాలకు జవాబు వ్రాయలేదని ఎంత నిష్ఠూరమో. మనం మాత్రం ఊరుకున్నామా! ఎంత మంచి సంబంధమయినా ఆమెకు నచ్చ చెప్పడం కష్టంగా వుంది మరి."

"ఇక చాలుతే ఊరుకో, ఏమిటూ ఏడుపూ వాడూ. నీకు పుణ్యముంటుంది వాడిని ఊరుకో బెట్టు" విసురుగా అన్నాడు.

"పిల్లలంటే ఇంట్లో ఆమాత్రం యేడవరూ?" విసురుగా వెళ్ళిపోయింది.

* * *

ఎన్ని ఉత్తరాలు వ్రాసినా జవాబు రాకపోయేసరికి పార్వతే వచ్చేసింది మద్రాసుకు. "ప్రేమతో ఆదరిస్తాడనుకొన్న అప్పటి తమ్ముడేనా ఈ డాక్టరు? ఎంతలో ఎంత మార్పు! మా రక్తంలో రక్తం. మేమిలా కష్టపడుతూ వుంటే చూస్తూ ఊరుకోను మనస్సెలా ఒప్పిందో?" కోపం, దుఃఖం రెండూ పెనగొన్నాయి. రెంటి మధ్యన పార్వతి సతమతమవుతూంది. తమ్ముడికి గడప త్రొక్కగానే ముఖం వాచేట్లు చీవాట్లు పెట్టాలని వచ్చింది. అప్పటికిగాని వాడికి బుద్ధి రాదనుకొంది. తమ్ముడి ముఖం చూచేసరికి చల్లబడిపోయింది. పెంచిన మమకారం కట్ట తెగి పొర్లింది. సుజాత (గోపి భార్య) ఎంతో ఆప్యాయంగా పలుకరించింది. ఆఖరివాడు "అత్తా, అత్తా" అంటూ కొంగు వదలలేదు. ఇదంతా చూచేసరికి గోపిని వేరుగా అర్థం చేసుకొన్నందుకు తనను తానే నిందించుకొంది. ఆ రోజంతా నవ్వులతో, మాటలతో గడిచిపోయింది. ఇంట్లో పట్టుమని గంట కూడ లేదు. ఉదయాన్నే వెళ్లిపోవాలనుకొంది. గోపి గూడ డిస్పెన్సరీకి పోవాలని తొందరపడుతున్నాడు. చిట్టి పెళ్లివిషయం తెచ్చింది మెల్లిగా పార్వతి. సుజాత అక్కడినుండి లేచి వెళ్లిపోయింది. ఇద్దరికీ మాటమీద మాట పెరిగింది, "అమ్మా, నాన్న నిన్నెంత కష్టపడి చదివించారు? మరిచిపోయావా? నా గాజుల కత నీకోసమే..." మధ్యలోనే ఆపింది.

"నీ గాజులజత ఎవడికొక్కావాలి? రేపే డబ్బు పారేస్తా. అమ్మ నాన్న కష్టపడి చదివించారు పాపం! డబ్బు నూరు పంపమంటె డెబ్భై, డెబ్భై పంపమంటే యాభై పంపే వాళ్లు. అదీ వూరికే పంపారా? తిట్టితిట్టి నాగుట్ట గూల్చారు."

"అయ్యో! నాకు డబ్బెందుకు? నిన్ను చదివించింది ఇలా మాట్లాడనా?" కళ్ళ నీళ్లు బొటబొట రాలాయి.

ఊరికి అప్పుడే వెళ్ళిపోయింది. పోయేటప్పుడు గోపికి చెప్పిపోదామనుకొంది. కాని గోపి ఎప్పుడో వెళ్ళిపోయాడు. ఇల్లు వదలిన మరుక్షణమునుండి గోపికి మనసు మనసులో లేదు. అక్కడ నిలువలేక పోయాడు. త్వరత్వరగా ఇంటికి నడిచాడు. "అక్కయ్య ఇంకా ఉంటుందా? ఉంటే తప్పు క్షమించమంటాను కాళ్లు పట్టుకుంటాను. ఇంటికివచ్చిన అక్కను ఎంత మాటలాడాను. చిట్టికి నేను పెళ్ళి చేయకపోతే ఇంకెవరు చేస్తారు? మూర్ఖుడిని" నిందించుకొంటూ నడిచాడు. పార్వతి ఎప్పుడో వెళ్ళిపోయింది. ఆ క్షణమే ప్రయాణమయాడు. సుజాత "వంటయింది భోంచేసి పోవచ్చు" అంటూ వెంటబడినా వినకుండా వెళ్ళిపోయాడు.

ఊరి పొలిమేరలోనే పాలేరు ఎదురయాడు. "దణ్ణం బాబూ!" అంటూ వెనకబడ్డాడు. గొడవగా మాట్లాడుతూ వస్తున్నాడు. "బాబూ చాలరోజులయిందే మా వూరొచ్చి. అబ్బబ్బ! ఆ పార్వతమ్మ తల్లి సీతమ్మ వోరులాగ కష్టపడుతుంది సామి. అప్పటి దినాల్లో మనది సంస్థానం గదా బాబయ్య. నాయన్న ఇప్పుడు చూస్తే కళ్ళకు నీళ్ళొస్తాయి. అది సరేగాని బాబయ్య! పార్వతమ్మ బండిదిగుతూ ఏడుస్తూ ఉండింది. ఇట్లో కూర్చొని ఏడుస్తూనే ఉండింది, నే నెంతడిగినా చెప్పలేదు. "చిట్టమ్మకు ఇంకా పెళ్ళి చేయలేదని ఏముండయినా అనిందేమో ననుకున్నా. అయినా వీళ్ళకేం రోగం బాబయ్యా? చిట్టమ్మను నే నెరగనూ? పెద్ద గాలివానకు పుట్టనేలేదు."

వీడిమాటలు వింటూంటే మనసులో కత్తి పెట్టి కెలికినట్లనిపించింది. గబగబ ఇంట్లోకి పోయాడు. ఇల్లు బావురుమంటూంది. "అక్కయ్యా!" అంటూ ఆవేశంతో అరిచాడు. పార్వతి నివ్వెరపడింది. "రా నాయనా!" అంటూ ఆదరణతో పిలిచింది. అక్క ఆదరణ చెలకతో కొట్టినట్టనిపించింది. "అక్కయ్యా! నేనన్న మాటలకు ఏడ్చావుగదూ? నా కప్పటిలో తెలివిలేకపోయింది. అవన్నీ మరచిపో. ఇక మీరిక్కడ ఉండొద్దు. సరేనా? నాన్న ముసలివాడయాడు. రేపే వెళ్ళిపోతాం. చిట్టికి పెళ్లి చేసే పూచీనాది. సరేనా? రేపే బయలుదేరుతాం" ఆ వేగంతో. ఆవేదనతో చెప్పలేకపోయాడు. పార్వతి కళ్లెందుకో చెమ్మగిల్లాయి.

మద్రాసు కొత్తగవర్నర్ కాంగ్రెసు ప్రముఖుడు. కేంద్రంలో అధికారంలో వున్న పార్టీ కాంగ్రెసు. కాగా, మద్రాసులో కూడా ఏవిధంగానైనా కాంగ్రెసు మంత్రివర్గాన్ని స్థాపించితీరాలని, అక్రమ మార్గాలద్వారా 'మైనారిటీని మెజారిటీ' చేయాలని హైకమాండ్ చేసిన కుట్రలో ఒక భాగమే మంత్రివర్గ నిర్మాణానికి రాజాజీ ఆహ్వానం: మద్రాస్‌లో ఎలాగైనా కాంగ్రెస్ మంత్రివర్గ నిర్మాణానికి "కుట్ర" జరుగుతున్నదని కొంతకాలం క్రితం వినవచ్చిన వదంతులను విశ్వసించలేకపోయాము. కాని: తమ పార్టీప్రభుత్వమే మద్రాసులో కూడా స్థాపించాలన్న కాంగ్రెసు హైకమాండ్, మద్రాసు గవర్నరుల కోర్కె ఫలించింది. పార్టీ రాజకీయాలకు అతీతంగా వుండవలసిన రాష్ట్రగవర్నరు, కేంద్ర ప్రభుత్వం కూడా పార్టీ పక్షపాతంతోనే ప్రవర్తిస్తున్నట్లు ఈ సంఘటన నిరూపిస్తున్నది. ఇది కఠిన విమర్శ కావచ్చు. కాని యథార్థం—తుర్లపాటి కుటుంబరావు.